జీలుగ సాగు-లాభాలు బాగు

- సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి
- పచ్చిరొట్టె ఎరువులతో పెరుగుతున్న భూసారం
- ఆసక్తి చూపుతున్న రైతులు
- అందుబాటులో సబ్సిడీ విత్తనాలు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు


కొండపేటలో రైతు సాగు చేసిన జీలుగ పంట

ఎర్రవల్లిచౌరస్తా: నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో రైతులు అధికంగా వరి పంటను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. జూరాల ఆయకట్టు కింద ఉన్న రైతులు కూడా వరిపంట సాగుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. జూరాల కుడి కాల్వ పరిధిలో డీ 31 నుంచి డీ 38 కాల్వల ఆయకట్టు రైతులు సుమారు ఇరవై వేల ఎకరాలకు పైగా వరి పంటను సాగుచేస్తున్నారు. ఇటిక్యాల మండలంలోని మొగిలిరావులచెర్వు, మునుగాల, నక్కలపల్లి, కొత్తదేవరపల్లి, పుటాన్‌దొడ్డి, కోదండాపురం, పుటాన్‌దొడ్డి, జింకలపల్లి, కొండేరు, షేకుపల్లి, సాసనూలు, ఎర్రవల్లి, తిమ్మాపురం, యాక్తాపురం, కొండపేట గ్రామాలతో పాటు తదితర గ్రామాలలో వరి పంటను అదికంగా సాగుచేస్తున్నారు. వరిని పండించే రైతులు పెట్టుబడిని తగ్గించేందుకు గాను జీలుగను సాగు చేయడానికి ఎక్కువగా ముందుకు వస్తున్నారు. వరి పంటను సాగు చేసే ముందు దుక్కి దున్ని జీలుగ విత్తనాలు వేస్తారు. ఈ పంట వేసిన 40 రోజుల తర్వాత ఏపుగా పెరిగిన వెంటనే దుక్కి ద్వారా కలియ దున్నడంతో భూసారం పెరిగి పంటలు చీడపీడల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటూ అధిక దిగుబడిని ఇస్తాయి.

పంట మార్పిడితో ప్రయోజనాలెన్నో..

ప్రతిసారి పంటల మార్పిడిని తప్పకుండా చేసుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. అధిక దిగుబడిని సాధించడానికి తక్కువ పెట్టుబడి, కోతులు, అడవిపందుల బెడద నుంచి తప్పించుకోవడానికి ఎక్కువగా రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. దీంతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు భూసారాన్ని పెంచి అధిక దిగుబడిని సాధించేందుకు జీలుగ పంట ఎంతో దోహదం చేస్తుంది. మార్కెట్‌లో 30 కేజీల జీలుగ విత్తనాల ధర రూ. 2415 ఉండగా సబ్సిడీ ద్వారా రైతులకు కేవలం రూ.845 కే ప్రభుత్వం అందిస్తోంది. ప్రస్తుతం పంటల సాగు విధానంలో మార్పుల వల్ల ఏ గ్రామంలో ఏఏ పంటలు సాగు చేయాలో వ్యవసాయ అధికారులు ప్రణాళికలు రూపొందించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

జీలుగ సాగు విధానం..

వర్షాకాలం ఆరంభం కాగానే వరి పంటను వేసే పొలంలో ఎకరాకు 25కిలోల చొప్పున జీలుగ విత్తనాలను పది కిలోల యూరియాతో కలిపి వెదజల్లాలి. విత్తనాలను వెదజల్లిన తర్వాత ట్రాక్టర్‌తో దుక్కిని తప్పకుండా దున్నాలి. వర్షాభావ పరిస్థితుల ఆధారంగా 30 నుంచి 40 రోజులలో జీలుగ పంట ఏపుగా ఎదిగి పూత దశకు చేరుకుంటుంది. పూత దశలోకి రాగానే జీలుగ పంటను ట్రాక్టర్ రోటవేటర్ లేదా కాడెద్దుల సహాయంతో భూమిలోకి దున్ని వేయాలి. దున్నిన తర్వాత సింగిల్ సూపర్ పాస్ఫెట్ ఎరువును భూమిలో చల్లాలి. అనంతరం దుక్కికి నీళ్లు పెట్టడం వల్ల జీలుగ పంట పూర్తిగా కుళ్లిపోయి పచ్చి రొట్టె ఎరువుగా తయారవుతుంది.

జీలుగ వల్ల ఉపయోగాలు..

జీలుగ ప్రధాన పంటకు కావల్సిన బలాన్ని అందిస్తుంది. జీలుగ సాగు చేయడం వల్ల వరి పంటకు కావలిసిన మూడు టన్నుల ఎరువు పచ్చి రొట్టె ఎరువుల ద్వారా లభిస్తుంది. దీనివల్ల మొక్కలకు రెండు శాతం నత్రజని, జింక్ సూపర్ పాస్ఫెట్ అదనంగా అందుతుంది. నేల సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తికి పచ్చిరొట్టె ఎరువులు దోహదం చేస్తాయి. జీలుగ లెగ్యూమ్ జాతికి చెందిన మొక్క కావడంతో వేర్లలో అధికంగా నత్రజనిని కలిగి ఉంటుంది. దీని వల్ల పంటలలో అధికంగా మొలిచే తుంగ, గరిక వంటి కలుపు మొక్కలను ఎదగకుండా ఇవి అడ్డుకుంటాయి. జీలుగ మొక్కలను భూమిలోకి దున్నడం వల్ల నత్రజని 27శాతం, భాస్వరం 53శాతం, పొటాషియం 22శాతం పంటలోని మొక్కలకు అందిస్తాయి. వరి పంటల్లో జీలుగను వాడటం వల్ల రసాయనిక ఎరువుల వినియోగం పూర్తిగా తగ్గడంతో పాటు రైతులకు పంట ఖర్చు తగ్గి, ఆదాయం పెరుగుతుంది.

సబ్సిడీలో జీలుగ విత్తనాలు..



నేలను సారవంతం చేయడంతో పాటు అధిక దిగుబడులను సాధించేందుకు రైతులు పచ్చిరొట్టె ఎరువులను తప్పనిసరిగా వినియోగించాలి. దీనికోసం ప్రభుత్వం 65శాతం సబ్సిడీ ద్వారా రైతులకు నేరుగా జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తుంది. ప్రస్తుతం పుటాన్‌దొడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో 30 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. కావల్సిన రైతులు స్థానిక వ్యవసాయ అధికారి ధ్రువీకరణ, పట్టాదారు పాసు పుస్తకంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొచ్చి కార్యాలయంలో సంప్రదించాలి.

– అయూబ్, మండల వ్యవసాయ అధికారి, ఇటిక్యాల

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..



సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. జీలుగతో పాటు జీవామృతం తయారీ విధానం, భూసారం పెంపుకోసం పాటించాల్సిన పద్ధతులను వివరిస్తున్నాం. భూసార పరీక్షలు నిర్వహించి ఏఏ పంటలను సాగు చేయాలో రైతులకు తెలియజేస్తున్నాం. రైతులు పంట సాగులో సేంద్రియ ఎరువులు వాడటంతో పాటు తెగుళ్ల నివారణ, అధిక దిగుబడి సాధించడానికి వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి.

– సక్రియ నాయక్, వ్యవసాయ సహాయ సంచాలకులు, అలంపూర్

క్లుప్తంగా

కళాశాల సమస్యలపై స్పీకర్‌కు వినతి


స్పీకర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలేజీ ప్రిన్సిపాల్

గట్టు: గట్టులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గట్టులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. గట్టు కాలేజీలో సైన్స్ గ్రూపులకు అనుమతి కావాలని, అధ్యాపకుల కొరతను తీర్చాలని, ప్రయోగాలకు సంబంధించిన పరికరాలు, ఇతర సౌకర్యాలను కల్పించాలని స్పీకర్‌కు విన్నవించినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ కమిషనర్‌తో స్పీకర్ మాట్లాడి, గట్టు కాలేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించినట్లుగా ప్రిన్సిపాల్ తెలిపారు.

మల్దకల్ ఎంఈఓగా సురేష్



మల్దకల్: మల్దకల్ ఇన్‌చార్జి ఎంఈఓగా సురేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎంఈఓ కొండారెడ్డి ఇటీవల పదవీ విరమణ పొందారు. ఆ స్థానంలో మల్దకల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న సురేష్ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. మండలంలో విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు, అంతకు ముందు సురేష్ దంపతులు ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

– ఇద్దరికి తీవ్ర గాయాలు

ఉండవెల్లి: బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను కారు ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రగాయాలైన ఘటన శనివారం అలంపూర్ చౌరస్తాలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. లింగన్‌వాయి గ్రామానికి చెందిన లక్ష్మన్న, బీచుపల్లి బైక్‌పై కర్నూల్ జిల్లా బేతంచర్ల మండలం, మద్దిలేటి స్వామి దర్శనానికి వెళ్తున్నారు. అలంపూర్ చౌరస్తా దాటి రిలయన్స్ పెట్రోల్‌బంక్ ఎదురుగా బైక్‌పై వెళ్తున్న వారిని హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారిని హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. బీచుపల్లి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ జగదీష్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాస్‌రావు వివరాల మేరకు.. గట్టు మండలం బల్గెర నుంచి మల్లాపురంతండాకు తరలిస్తుండగా ఎలాంటి అనుమతి లేకుండా వస్తున్న ఇసుక ట్రాక్టర్లను పోలీసుల సమాచారం మేరకు మల్లాపురం శివారున పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్ డ్రైవర్ వీరేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్యాస్ లీకై గుడిసె దగ్ధం



గట్టు: మండలంలోని పెంచికలపాడు స్టేజీ దగ్గర శనివారం గ్యాస్ లీకై గుడిసె దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. ఆరగిద్ద గ్రామానికి చెందిన మారెప్ప అతని భార్య అమ్ములమ్మ గట్టు, మల్దకల్ దారి లో పెంచికలపాడు స్టేజీ దగ్గర రోడ్డు పక్కన గుడిసె వేసుకుని, చేపల ఫ్రై చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గుడిసెలో వంట చేస్తున్న క్రమంలో గ్యాస్ లీకై మంటలు గుడిసెకు వ్యాపించాయి. ఈ మంటలు గుడిసెకు పాకడంతో గుడిసెలో వంట చేస్తున్న ఇద్దరు బయటికి పరుగు తీశారు. గుడిసెలో ఉన్న ఫ్రిజ్, వంట సామగ్రి కాలిబూడిదైంది. దీన్ని గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే అక్కడికి చేరుకొని పక్కనున్న గుడిసెలకు మంటలు వ్యాపించకుండా వాటిపై నీటితో చల్లారు. దీంతో మంటలు వ్యాపించలేదు. ఈ ప్రమాదంలో సుమారుగా రూ.1.5 లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు బాధితులు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.20వేల అందజేత



మల్దకల్: మండలంలోని ఎల్కూరులో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న బుడ్డమ్మ (42) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందడంతో బాధిత కుటుంబసభ్యులకు సీడీపీఓ కమలాదేవి ప్రభుత్వం తరఫున రూ.20వేల నగదు అందజేశారు. ఆమెకు ఆరోగ్యం క్షీణించడంతో శుక్రవారం కుటుంబసభ్యులు గద్వాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, టీ చర్లు షమీం, లక్ష్మీరంగమ్మ, మహేశ్వరమ్మలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు


బ్రహ్మంగారి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

ఉండవెల్లి: మండలంలోని భైరాపురంలో వైశాక శుద్ధ బహుళ దశమి నాడు బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు గ్రామస్తులు ఘనంగా ప్రారంభించారు. ఆలయ అర్చకులు మౌలాలి, గురుస్వామి రామకృష్ణ బృందం ఆధ్వర్యంలో ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పూడిచర్ల ఈశ్వరయ్య, రామరావు, శ్రీనివాసులు, సుంకన్న, రాముడు, కృష్ణ, ఆర్డీఎస్ కృష్ణ, సరోజమ్మ, మద్దమ్మ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి


మాచర్లలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

గట్టు: మండలంలోని మాచర్లలో శనివారం తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం యూనియన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంఘటనపై మాచర్లలో నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాచర్ల గ్రామానికి చెందిన తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంతి


శాంతినగర్‌లో కన్యకాపరమేశ్వరిమాతకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు


మల్దకల్ కన్యకా పరమేశ్వరిదేవికి పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

శాంతినగర్: ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను శాంతినగర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. కోయిల్‌దిన్నె రోడ్డు సమీపంలో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రాతఃకాలం నుంచి ప్రత్యేక పూజలు మొదలయ్యాయి. అభిషేకాలు, కుంకుమార్చనలు, మహమంగళహారతి నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రావూరి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో 21 రకాల హారతులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మల్దకల్: మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరిదేవి జయంతి ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వెంకటేష్‌శెట్టి, శ్రీనివాసులు, నాగరాజు, రామకృష్ణ, రాజు, నర్సింహయ్య పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు


ఆదిశిలా క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చిన భక్తులతో ఆదిశిలాక్షేత్రం ఆవరణ మొత్తం పోటెత్తింది. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు రమేసాచారి, రవిచారిలు స్వామివారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కొంత మంది భక్తులు స్వామి వారికి దాసంగాలు పెట్టారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాలలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, చంద్రశేఖర్‌రావు, సవారి, వీరారెడ్డి, ఆలయ సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ, వాల్మీకి పూజారులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్


గుంతలకు ఎర్రమట్టి వేసి జేసీబీతో చదును చేస్తున్న సిబ్బంది

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్, కోయిల్‌దిన్నె రోడ్డు 9వ వార్డు, 4వ వార్డులో శనివారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం మున్సిపాలిటీ సిబ్బంది చేపట్టారు. మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున డ్రెయినేజీలు నిండి రోడ్లపైకి నీళ్లు వస్తుండటంతో మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. అక్కడక్కడ గుంతలు పడిన చోట ఎర్రమట్టి వేయించి చదును చేయించారు.

మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో శనివారం పారిశుద్ధ్య కార్మికులు వివిధ కాలనీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. డ్రెయినేజీలో మురుగును తొలగిస్తూ, రోడ్లపై ఉన్న చెత్తను తొలగించారు. వర్షాలు మొదలవుతున్న తరుణంలో గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టి పెడుతున్నట్లు పంచాయతీ సిబ్బంది పేర్కొన్నారు.

బురదతో వాహనదారుల అవస్థలు


బురదమయంగా మారిన రోడ్డు

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, మానవపాడు, అమరవాయి, చిన్న ఆముదాలపాడు, నారాయణపురం, పెద్ద ఆముదాలపాడు, తదితర గ్రామాల నుంచి అలంపూర్ చౌరస్తాకు వెళ్లే ప్రధాన దారిలో చెన్నిపాడు-చిన్న పోతులపాడు మధ్యలో వాగుకు నూతన వంతెనను నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో వాహనాల రాకపోకల కోసం వంతెన పక్కనే తాత్కాలిక రహదారిని నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలతో రహదారి మొత్తం పూర్తిగా బురదమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బురదలో ఏర్పడిన గుంతల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు సైతం ఇరుక్కుపోవడంతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బురదను తొలగించి రహదారిపై వాహనాలు సక్రమంగా నడిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజ



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజ నిర్వహించారు. శనివారం ఉత్తర నక్షత్రం సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్దెనిమిది మెట్లకు ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి, గురు స్వాములు సూర్యకాంతారెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



మానవపాడు: మండలంలోని చెన్నిపాడు నుంచి మానవపాడుకు వెళ్లే రహదారిలో ఇటీవల కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభం వరిగింది. దీనివల్ల రహదారి పక్కన ప్రమాదకరంగా ఉండటంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ అధికారులు తక్షణమే స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వీరభద్రస్వామి ఉత్సవాలు ప్రారంభం



పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌లో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానం పదో వార్షికోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయంలో అభిషేకం, దాసంగాల సమర్పణ, లక్ష్మీగణపతి, నవగ్రహ హోమం నిర్వహించారు. మొదటి రోజు ఉత్సవాల సందర్భంగా ఆలయంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి ఆలయ ఆవరణలో భజన పోటీలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

నేడు అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌లో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. పోటీలకు పేర్లను నమోదు చేసుకున్న వారు సకాలంలో హాజరుకావాలని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గెలుపొందిన జట్లకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు


విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న నాయీబ్రాహ్మణ సేవ సంఘం పెద్దలు

గద్వాల అర్బన్: నాయీబ్రహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నాయీబ్రహ్మణ విద్యార్థులకు శనివారం జిల్లా కేంద్రం రాంనగర్‌లోని రామాలయంలో ప్రొత్సాహకాలు అందజేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకటరమణ ఏర్పాటు చేసిన రూ.2లక్షల విద్యానిధి నుంచి ఈ బహుతులు అందజేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందించడంతో పాటు మంచి ఉత్తీర్ణత సాధించిన 20మంది విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్కులు, మోమెంటోలు అందించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు నిధిని ఏర్పాటు చేసిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకటరమణను అభినందించారు. కార్యక్రమంలో నాయీబ్రహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు భగీరథ వంశీ, పట్టణ అధ్యక్షుడు చంద్రికశివ, ప్రధాన కార్యదర్శి వల్లూరు గోపాల్, ట్రెజరీ వల్లూరు ఆంజనేయులు, నాయకులు జయన్న, పద్మయ్య, శ్రీనివాసులు, భజంత్రీ బలరాములు, దౌలన్న, గోపి ఉన్నారు.

ప్రమాదకరంగా డ్రెయినేజీలు

- పలుచోట్ల దెబ్బతిన్న గూనలు
- వర్షానికి వీధుల్లో పారుతున్న నీరు
- రాకపోకలకు ప్రజలకు ఇబ్బందులు


చింతలకుంటలో రోడ్డుపైకి చేరిన మురుగు

కేటీదొడ్డి: మండలంలోని పలు గ్రామాల్లో డ్రెయినేజీల దెబ్బతిని ప్రమాదకరంగా ఉంది. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ విషమై స్థానిక ప్రజలు సంబంధిత అధికారులకు అనేకసార్లు విన్నవించినా స్పందన కరువైంది. మండలంలోని కొండాపురం గ్రామంలోని డ్రెయినేజీలు పూర్తిగా ముసుకుపోయి పలువురు పగులగొట్టారు. దీంతో ఇటీవల కురిసిన వర్షానికి నీరు వీధుల్లో ప్రవహించి, కాలనీ ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. కొన్ని కాలనీలో రోడ్లపైకి నీళ్లు వచ్చి వాహనదారులు కాల్వలో పడి గాయాలైన సంఘటనలున్నాయి. ఆ ప్రాంతంలోని నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని కొండాపురం, చింతలకుంట, కేటీదొడ్డి, నందిన్నె, ఉమిత్యాల, కుచినెర్ల, పాతపాలెం, పాగుంట, వెంకటాపురం, వివిధ గామాల్లో పలుచోట్ల కాల్వలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల డ్రెయినేజీలు పూడ్చి రోడ్లపై ఇండ్లు నిర్మించుకోవడంతో మురుగు నీరు వీధుల్లో ప్రవహిస్తోంది. మురుగు ఇళ్లలోకి చేరుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూడిపోయిన మురుగు కాల్వలు..

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మురుగు కాల్వలపై పంచాయతీ సిబ్బంది, ప్రత్యేకాధికారులు దృష్టి సారించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో కాల్వలు పూడిపోయి మురుగు నీరు రోడ్లపై నిలిచి దుర్వాసన, దోమలు, ఈగలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


డ్రెయినేజీ పూడి ఆగిన మురుగు

ప్రమాదాలు జరుగుతున్నాయి



మండలంలోని చింతలకుంట గ్రామంలోని డ్రెయినేజీలు పూర్తిగా పూడుకుపోయి మురుగునీరు వీధుల్లో రోడ్లపై పారుతోంది. దీంతో నిత్యం గుంతలుగా ఏర్పడి బైక్‌పై నుంచి కిందపడిన సంఘటనలున్నాయి. అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.

– వీరన్నగౌడు, చింతలకుంట

మురుగుపై స్పందించాలి

మా గ్రామంలో మురుగు కాల్వలు ప్రమాదకరంగా మారాయి. పలు కాలనీలో పూడిక తీయడం లేదు. దీంతో దుర్వాసన వస్తోంది. దోమలు ఈగల సంచారంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలి.

– కర్రెప్ప, కేటీదొడ్డి

మరమ్మతులు చేస్తాం..

గ్రామాల్లో డ్రెయినేజీ సమస్యలు ఎప్పడికప్పుడు సిబ్బందితో చేయిస్తున్నాం. అక్కడక్కడ ఉన్న డ్రెయినేజీల సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాం. పాత కాలం డ్రెయినేజీ కావడంతో దెబ్బతిని మురుగు బయటకు వస్తోంది. వాటిని కూడా మరమ్మతు చేయిస్తాం.

– ఎంపీఓ సయ్యద్‌ఖాన్, కేటీదొడ్డి

24న విత్తనాల మేళా

కొత్తకోట రూరల్: రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలనే ఉద్దేశంతో నాగర్‌కర్నూల్ జిల్లా పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం వారి ఆధ్వర్యంలో ఈనెల 24న విత్తనాల మేళా నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి షేక్‌మున్నా తెలిపారు. ఈ మేళాలో వివిధ రకాల పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తన రకాలను విక్రయానికి అందుబాటులో ఉంటాయన్నారు. పంటల సమగ్ర సమాచారం శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని, ఆసక్తి ఉన్న రైతులు శుక్రవారం ఉదయం 10గంటలకు పాలెం వ్యవసాయ పరిశోధనా కేంద్రం వద్ద చేరుకోవాలని తెలిపారు. శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలు, సూచనలు పొందాలని, అవసరం ఉన్న విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని సూచించారు.